క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గాంధీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, అనీల్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో జాగిరి రాజు, వేణు, భిక్షపతి, రమేష్, పరశురాం, రోహిణి, సునీత, మమత, లింగమ్మ, నరేందర్, శిరీష, శ్రీను, లాస్య తదితరులు ఉన్నారు.

ఎన్‌ఐఎన్‌ను సందర్శించిన ఫార్మసీ విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్)లోని యానిమల్ ఫెసిలిటీ ల్యాబ్‌ను సందర్శించారు. జంతువుల కోసం ఎన్‌ఐఎన్‌లో సౌకర్యాలు, నిర్వహణ తీరు తెన్నులు, వాటికి నిర్వహించే పరీక్షలు, ప్రీ క్లినికల్ అధ్యయనాలపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం...బిహార్‌కు చెందిన ధీరేంద్ర కుమార్(19) బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం రుద్రారం వచ్చాడు. ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తూ స్థానికంగా నివాసముంటున్నాడు. శనివారం డ్యూటీకి వెళ్లి..తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో హోటల్ ప్యాలెస్ ముందు రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ధీరేంద్ర కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి: పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లరంగు గళ్ళ షర్టు వేసుకున్నాడు. ఎడమ చేయిపై సరస్వతి అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. లోకో పైలెట్ సమాచారంతో నాంపల్లి జీఆర్పీ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

రోగులకు పండ్ల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సంజీవ రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల కొరకు రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక వ్యక్తి సంజీవ రెడ్డి అన్నారు.





చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

శివోహం..

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు

ఓం నమఃశివాయ....'శంభో శంకర...హరహర మహాదేవా'.. అంటూ శివ నామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి పూజలు, పంచామృతాభిషేకం చేశారు. పలుచోట్ల శివయ్యకు భక్తులు స్వయంగా అభిషేకం చేశారు. - శేరిలింగంపల్లి జోన్‌బృందం



గౌలిదొడ్డి శివాలయంలో అభిషేక పూజలో పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దంపతులు



గంగారం ఆంజనేయస్వామి ఆలయంలో ..



ఇందిరానగర్‌లో.. బారులు తీరిన భక్తులు

మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం



బీరంగూడ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువైన మల్లికార్జున స్వామికి భక్తులు రుద్రాభిషేకం చేశారు. అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున రుద్రాభిషేకం ప్రారంభించినట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈఓ శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు తులసిరెడ్డి మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలో వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం, రథోత్సవం నిర్వహిస్తామన్నారు. - పటాన్‌చెరు టౌన్



శివపాద మంజీరనాదం



శివరాత్రి ఉత్సవాలలో భాగంగా శిల్పారామంలో శనివారం డాక్టర్ వినీల శిష్యబృందం కూచిపూడి ప్రదర్శన నయనానందకరంగా సాగింది. ఇందులో శంభో, శివపాద మంజీరం, ఆనందతాండవం, శివాష్టకం, శంకరశ్రీగిరి, శివతాండవం, కృష్ణశబ్దం అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సినీ నిర్మాత రామసత్యనారాయణ, సిద్దార్థ స్పోర్ట్స్ అడిటోరియం సెక్రటరీ విజయ్‌కుమార్, సినీ రైటర్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. - మాదాపూర్

గోపన్‌పల్లిలో అదృశ్యం..బెంగళూర్‌లో ప్రత్యక్షం

ముగ్గురు పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



ముగ్గురు పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించిన గచ్చిబౌలి పోలీసులు

గచ్చిబౌలి: గోపన్‌పల్లిలో అదృశ్యమైన ముగ్గురు పిల్లలను బెంగళూర్‌లో ఉన్నట్లు కనుగొన్న గచ్చిబౌలి పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. గచ్చిబౌలి సీఐ గోనె సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లిలోని విద్యానికేతన్‌లో 8వ తరగతి చదివే కె.అభిరామ్(14), నాల్గవ తరగతి చదివే బీబీ నజ్మీన్(13) గోపన్‌పల్లిలో ట్యూషన్‌కు వెళుతుంటారు. బెంగళూర్‌లో 7వ తరగతి చదివి గోపన్‌పల్లికి వచ్చిన పి.చరణ్(14) పరిచయం అయ్యాడు. బెంగళూర్ సిటీ బాగుంటుందని చెప్పడంతో ముగ్గురు ఇంట్లో చెప్పకుండా వెళ్లారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు ట్యూషన్ నుంచి ఆటోలో నేరుగా లంగర్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడి నుంచి కర్నాటక బస్సులో యాదగిరి వెళ్లి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బెంగళూర్‌కు వెళ్లారు. చరణ్ స్నేహితుడు రితిక్ వద్దకు వెళ్లారు. నజీమ్ తండ్రి ముక్రా అలం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు చరణ్ ద్వారా బెంగళూర్‌కు వెళ్లే అవకాశం ఉందని భావించారు. బెంగళూర్‌కు వెళ్లిన పోలీసులు మెజిస్టిక్ సిటీ ఏరియాలో ముగ్గురు పిల్లలను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. బెంగళూర్ సిటీ బాగుంటుదని చూసేందుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్లు అరెస్ట్.. రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నర్సింహారావు

మియాపూర్ : నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంచుకెళ్లిన ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి 4 తులాల బంగారం, ఓ పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మియాపూర్ ఏసీపీ పి.నర్సింహారావు కేసు వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా కొత్తవాడ పద్మానగర్‌కు చెందిన వేణువంక సురేష్(23), అతని సోదరుడైన వడ్లూరి నిఖిల్(21) మియాపూర్‌లోని న్యూ హాఫీజ్‌పేటలోని మార్తాండనగర్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. డబ్బులు చాలకపోవడం, మద్యం, చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనానికి పాల్పడ్డారు. ఇరువురు మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృషినగర్‌లో ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బైక్‌పై వచ్చి మహిళ మెడలోంచి బంగారు మంగళసూత్రం దొంగిలించి పారిపోయారు .మియాపూర్ పోలీస్‌లు, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా న్యూహాఫీజ్‌పేట మార్తాండ నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపు వచ్చిన సురేష్, నిఖిల్‌లను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో మియాపూర్ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కేసు ఛేదించిన మియాపూర్ సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ జగదీశ్వర్, సీసీఎస్ మాదాపూర్ ఎస్ఐ పరుశురాం, ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాష్, అశోక్‌లకు ఏసీపీ అభినందించారు.

యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన మణెమ్మ రెండో కూతురు మాధురి(19) ఇంటర్ చదివి ఇంటి వద్ద ఉంటోంది. శనివారం మణెమ్మ డ్యూటీకి వెళ్లగా, ఇంట్లో ఉన్న మాధురి చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న మణెమ్మ మరిది జగన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన తల్లికి ఇంటికి వచ్చింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మాధురి పవన్‌కు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. వెంటనే పవన్ స్నేహితులు మాధురి ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.

నేడు బైక్‌ర్యాలీ

పటాన్‌చెరుటౌన్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం నుంచి శనివారం బైక్ ర్యాలీ ప్రారంభించనున్నట్లు పటాన్‌చెరు ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు రాజుగోపాల్ యాదవ్ శుక్రవారం తెలిపారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు పంచముఖి హనుమాన్ ఆలయం నుంచి మహంకాళి దేవస్థానం వరకు కొనసాగుతుందన్నారు. మహంకాళి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆరెంజ్ జ్యూస్ పంపిణీ

ఆల్విన్‌కాలనీ: మహాశివరాత్రి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళి చౌరస్తాలో బార్న్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంజునాథ్, నరేందర్ యాదవ్, రఘు వారి మిత్రులు శనివారం ఆరెంజ్ జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పాల్గొని పాదచారులకు, వాహనదారులకు జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో టీవీబీ రెడ్డి, శ్రీకాంత్, రాకేష్, వెంకట్, ఫిరోజ్, బస్వరాజ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గచ్చిబౌలి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి ఉందనే సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం నక్కా రాజు((22)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద బ్యాగులో ఉన్న 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి రాని 'అల్ట్రాసౌండ్'



అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్



శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తెలంగాణ డయాగ్నొస్టిక్స్ మినీ హబ్‌లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ఉన్నా సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. యూపీహెచ్‌సీలో గతంలో యంత్రం లేక సమస్య అయితే నేడు సిబ్బంది లేక సమస్య అని, ఆస్పత్రిలోనే సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.ఈ యూపీహెచ్‌సీ ద్వారా చాలా మంది పేద, మధ్య తరగతి వర్గాల వారు వైద్య సేవలను పొందుతున్నారు. ఈ ఆస్పత్రికి బస్తీ దవాఖానాలతో పాటు హఫీజ్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి కూడా పరీక్షల కోసం వస్తుంటారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే మంచి ప్రభుత్వ ఆస్పత్రిగా గుర్తింపు కూడా ఉండడంతో దీని ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.

- శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ పరిధిలోకి 8 బస్తీ దవాఖానాలు ఉన్నాయి.
- మండల పరిధిలోని గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, నెహ్రూనగర్, పాపిరెడ్డి కాలనీ, గంగారం, ఇందిరానగర్, వేమన కాలనీ, మధురానగర్‌లోని బస్తీ దవాఖానల నుంచి రోగులను పరీక్షల కోసం శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీకే పంపిస్తారు.
- ఈ ఆస్పత్రిలో గత ఏడాది మే 11వ తేదీ తెలంగాణ డయాగ్నొస్టిక్స్ మినీ హబ్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.
- ఇందులో ఎక్స్‌రే, ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లతో రేడియాలజీ విభాగం, 57 రకాల పరీక్షలు చేయడం కోసం ల్యాబ్ ఏర్పాటు చేశారు.
- కానీ రేడియాలజీ విభాగంలో ఈసీజీ ఎక్స్‌రేలు తీస్తున్నప్పటికీ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు.
- ముఖ్యంగా గర్భిణులకు ఈ పరీక్షలు అవసరం .అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడు సార్లు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తారు. బయట స్కానింగ్ చేసేందుకు రూ.800- రూ 1000 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో పేద మహిళలు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

జనాభా ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలి

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: జనాభా ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి, కొండాపూర్ డివిజన్ కోఆర్డినేటర్ మారబోయిన రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో రాఘవేంద్రనగర్ కాలనీలో శనివారం శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ పిలుపు మేరకు 11000 శక్తి కేంద్రాలలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, జయరామ్ యాదవ్, వినీత సింగ్, పవన్, సుచిత్ర, సంధ్య, పుల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.